# రైతు సంక్షేమమే ఎజెండా


కొన్నూరులో నేలవాలిన వరి పంటను పరిశీలిస్తున్న మార్కెట్ చైర్మన్ ప్రశాంత్

**అమరచింత:** ప్రభుత్వం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఏఓ అరవింద్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటొరెడ్డి, సీఈఓ నరేష్ అన్నారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో మహంకాళి విష్ణు, తిరుమలేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, హనుమంతునాయక్, శ్యాం, ప్రకాశం, బాలరాజ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

**బాధిత రైతులను ఆదుకుంటాం**

కొత్తకోట రూరల్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్ అన్నారు. ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. సోమవారం మండలంలోని కనిమెట్టలో వరి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని, వర్షానికి ఈదురు గాలులకు నేలకొరిగిన వరి పైర్లను, రాలిపోయిన మామిడి కాయలను ఏఓ జాస్మిన్, ఏఈఓ స్పందన తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, రావుల కరుణాకర్‌రెడ్డి,గోకరయ్య నాయుడు,యాదగిరి, కోటీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

**మదనాపురం:** కొన్నూరు, ద్వారక నగర్‌లో గాలి వాన కారణంగా నష్టపోయిన వరి పంటలను, మామిడి తోటలను క్షేత్రస్థాయిలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మట్లాడుతూ ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు పంటలు నష్టపోయిన రైతుల వివరాలు తెలుసుకుంటున్నామన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. పంట నష్టంపై పూర్తి నివేదిక వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జగదీష్, ఏఓ గాయత్రీ, ఏఈఓ అనిత, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, రావుల కర్ణాకర్‌రెడ్డి, భాస్కర్ ఆచారి, గోకరయ్య, వెంకట్రాంరెడ్డి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.


కనిమెట్టలో తడిసిన ధాన్యం పరిశీలన

## క్లుప్తంగా

### రూ.1.5 లక్షల విరాళం

**ఆత్మకూర్:** పట్టణంలోని రాజవీధిలో పెద్దమ్మ తల్లి ఆలయ పునఃనిర్మాణం కోసం డాక్టర్ మణి వర్ధన్‌రెడ్డి రూ.1.50 లక్షల నగదును నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, వాస్తుపండితుడు రమాకాంత్, శివానంద్, రవియాదవ్, ఎస్టీడీ శ్రీను, ఆనంద్, చెట్లశ్రీను, బాలకృష్ణ ఉన్నారు.

### బాల్యవివాహాలను నిర్మూలిద్దాం

**వనపర్తి రూరల్:** బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో రోడ్డు భద్రత, బాలకార్మిక వ్యవస్థ, సైబర్ నేరాలు, బాల్య వివాహలపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న తగాదాలతో క్షణికావేశాలకు లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. రోడ్డుపై ప్రయాణం చేసేటపుడు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

### రహదారి నిబంధనలు పాటించాలి



**ఆత్మకూర్:** వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఎస్ఐ నరేందర్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనదారులు, ప్రయాణికులకు ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, పత్రాలు వెంట ఉంచుకోవాలని, హెల్మెంట్ ధరించాలని, డ్రైవింగ్‌లో మద్యం తాగరాదని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రవీందర్, బాలరాజు, రమేష్, రామకృష్ణ, గుప్త ఉన్నారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

**పాన్‌గల్:** శ్రీ విశ్వావసు నామ సంవత్సర శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని సోమవారం మండలంలోని అన్నారంలో త్రైత సిద్ధాంతం-ప్రభోద సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరుల వారు రాసిన త్రైత సిద్ధాంత భగవద్గీత, 100 రకాల గ్రంథాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు, సభ్యులు సురేష్‌కుమార్, బద్రీనాథ్, కృష్ణయ్య, బాలమ్మ, స్వరూప, నాగరత్నం, లలిత, సౌమ్య నిశాంత్, సాత్విక్, శశికుమార్, స్నేహ, శివమ్మ పాల్గొన్నారు.

### పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**పాన్‌గల్:** గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకొని ఆరోగ్యం కాపాడుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీన్‌బేగం అన్నారు. పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చేతుల శుభ్రత, ముర్రుపాల వినియోగంపై అవగాహన కల్పించారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, మాధవి, ఇందిర, తిరుపతమ్మ, జీలేఖ తదితరులు పాల్గొన్నారు.

### డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జరిమానా

**వనపర్తి రూరల్:** శ్రీరంగాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి సోమవారం న్యాయమూర్తి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు శ్రీరంగాపురం ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలంలోని మాందాపురం గ్రామానికి చెందిన శంకరయ్య, శాఖాపూర్‌కు చెందిన కురుమూర్తి మద్యం తాగి వాహనం నడుపుతూ కంభాళాపురం వద్ద పోలీసులు చేపడుతున్న తనిఖీల్లో పట్టుబడ్డారు. వీరికి వనపర్తి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించారు. అదేవిధంగా తాటిపాములకు చెందిన సుగుణమ్మను తోటి కోడలు కృష్ణమ్మ తిట్టిందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో.. కృష్ణమ్మను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.200 జరిమానా విధించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

### ఇసుక డంపు సీజ్

**ఖిల్లాఘనపురం:** మండల కేంద్రం సమీపంలో పిల్లివాగు వద్ద ఉన్న ఇసుక డంపును సోమవారం తహసీల్దార్ సుగుణ, ఎస్ఐ సురేష్‌గౌడ్ పరిశీలించి సీజ్ చేసినట్లు తెలిపారు. పిల్లి వాగు నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఇసుకను బయటకు తీసి డంపు చేసినట్లు వారు చెప్పారు. సుమారు 105 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు వెల్లడించారు. వారి వెంట ఏఎస్ఐ సత్యంగౌడ్, ఆర్ఐ తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

# పంచాయతీ కార్యదర్శికి వినతి


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**పాన్‌గల్:** మండలంలోని రేమద్దులలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ గ్రామంలోని నాల్గో వార్డులో మెయిన్ వాల్స్‌కు మూతలు ఏర్పాటు చేయాలని, 9వ వార్డులో హైస్కూల్ ప్రధాన గేటు ఎదుట ప్రవహిస్తున్న మురుగు నిరోధించాలని, గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఒకటో వార్డులో ప్రమాదకరంగా ఉన్న కోనేరు పూడ్చడంతో పాటు తాగునీటి ఓఆర్ఎస్ ట్యాంకులను శుభ్రం చేసి, గేట్ వాల్వ్‌కు మూతలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా సమస్యలను మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని కార్యదర్శి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటయ్య, భగత్, మల్లేష్, చిన్న వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ‘మున్సిపల్ పీఠం కైవసం చేసుకోవాలి’


మాట్లాడుతున్న రాజశేఖర్‌గౌడ్

**వనపర్తిటౌన్:** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఎక్కువ మందిని కౌన్సిలర్లుగా గెలిపించుకొని మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో పట్టణ క్రియాశీల సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డు ఇన్‌చార్జ్‌లను నియమించుకొని, ప్రణాళిక ప్రకారం వనపర్తి మున్సిపాలిటీలోని 33 వార్డుల్లో బీజేపీ సత్తాచాటాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, వాటి ఉపయోగాల వివరాలు పట్టణంలోని ప్రతి ఇంటికి వివరించాలన్నారు. కార్యక్రమంలో సబ్బిరెడ్డి వెంకటరెడ్డి, సీతారాములు, బాశెట్టి శ్రీను, సుమిత్రమ్మ, బచ్చు రాము, అలివేలమ్మ, కృష్ణగౌడ్, రఘు నాయుడు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

### శకుంతల దేవికి ఘన నివాళి

**వనపర్తి రూరల్:** ప్రముఖ గణితవేత్త, మానవ కంప్యూటర్‌గా పేరు గాంచిన శకుంతల దేవి వర్ధంతిని పురస్కరించుకొని శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, అరుణకుమారి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### బీడీ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం

**అమరచింత:** బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తూ వారి హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు చేస్తున్నామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కోశాధికారి రాజు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం చింతలయ్య వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజన్న, సామేలు, మస్తమణి, జిలాని, భక్తి తదితరులు పాల్గొన్నారు.

### క్షయ నిర్ధారణ పరీక్షలు

**పాన్‌గల్:** మండలంలోని జమ్మాపూర్‌లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్ఓ రామయ్య తెలిపారు. గ్రామంలో 69 మందికి ఎక్స్‌రే, తెమడ శాంపిల్స్ వంటి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ జిల్లా కోఆర్డినేటర్ వినోద్, ఎక్స్‌రే టెక్నీషియన్ ఈశ్వర్, ఎంఎల్‌హెచ్‌పీ నాగరాజు, వైద్య సిబ్బంది సతీష్, ఇస్తేరమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### కిరాణ దుకాణంలో చోరీ

**వీపనగండ్ల:** బొల్లారంలోని కిరాణం షాపులో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్ఐ రాణి కథనం ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం సాయిప్రకాష్ శెట్టి ఇంటి వద్ద పని ఉండడంతో దుకాణానికి తాళం వేయకుండా వెళ్లాడు. చుట్టుపక్కల వారు కిరాణం షాపు తెరిచి ఉండటాన్ని గమనించి యజమానికి సమాచారం ఇచ్చారు. అతడు వచ్చి చూడగా రూ.10 వేలు చోరీకి గురైనట్లు గుర్తించి సోమవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆమె తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**వనపర్తి విద్యావిభాగం:** 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ, ఏఐఈఈఈ, ఎంసెట్ కోర్సుల కోచింగ్ కోసం జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుంచి రెన్యూవల్ దరఖాస్తులను ఆహ్వానించాల్సిందిగా ఎస్‌సీడీడీ కమిషనర్ తెలిపినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు గడువు ఈనెల 30 వరకు ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న కళాశాలలను జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ద్వారా తనిఖీ చేసి అర్హత గల కళాశాలలు ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తులను http://telanganaepass.cgg.gov.in నమోదు చేసుకోవాలని సూచించారు.

### ‘తరుగు పేరుతో రైతులకు ఇబ్బందులు’

**వనపర్తి రూరల్:** రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరాచారి ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కిష్టగిరి, పెద్దగూడెం తండాలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 12 రోజులు అవుతున్నా కొనుగోలు చేయడం లేదన్నారు. తేమశాతం వచ్చి వడ్ల ను కొనుగోలు చేసి లారీల్లో తరలించినా మిల్లర్లు అన్‌లోడ్ చేసుకోకుండా తరుగు తీస్తామని రైతులను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. కుర్మయ్య, నరసింహ, రాములు, బాల య్య, మన్యం, మద్దిలేటి పాల్గొన్నారు.

### నిత్యావసర సరుకుల పంపిణీ

**వనపర్తిటౌన్:** జిల్లా కేంద్రంలోని చాడేశ్వరి వృద్ధాశ్రమానికి సోమవారం పదో బెటాలియన్ టీజీఎస్పీ బీచుపల్లి కమాండెంట్ ఎన్వీ సాంబయ్య, అడిషనల్ కమాండెంట్ జయరాజ్, అడిషనల్ కమాండెంట్లు పాని, శ్రీనివాసులు, ఆర్ఐ రమేష్‌బాబు, రాజు, శ్రీధర్, ఆర్ఎస్ఐ బాల్‌నాయక్, విజయ్‌కుమార్, ఏఆర్ఎస్ఐ మొగలయ్య, జంగయ్య, నాగరాజు, అప్పన్న, వి.జనార్దన్ చారి నిత్యవసర సరుకులు అందించారు.

### డయాలసిస్ రోగులకు పింఛన్ ఇవ్వాలి

**ఆత్మకూర్:** డయాలసిస్ రోగులకు ప్రభుత్వం పింఛన్ అందించి ఆదుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో రోగులతో మాట్లాడారు. ఆత్మకూర్‌లో డయాలసిస్ సేవలను వెంటనే ప్రారంభించాలని, రోగులకు ప్రతినెల రూ.2వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యూనూస్, సమీర్, చరణ్, వసీం, ఇమ్రాన్ ఉన్నారు.

### వ్యక్తికి శిక్ష ఖరారు

**చిన్నంబావి:** మండలంలోని చిన్నమారు గ్రామానికి చెందిన కావలి శంకరమ్మతో అదే గ్రామానికి చెందిన కావలి బాబు 2018 సంవత్సరంలో అసభ్యంగా ప్రవర్తించాడని మహిళ ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై అప్పటి ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి వనపర్తి సెకండ్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఏడేళ్లుగా ట్రయల్ జరగగా.. జడ్జి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1500 జరిమానా విధించినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

### యువతి అదృశ్యం



**కొత్తకోట రూరల్:** మండలంలోని పామాపురం గ్రామానికి చెందిన ఓ యువతి కనిపించడం లేదని తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు.. పామాపురం గ్రామానికి చెందిన మానపాడు సాయిలు కూతురు నాగమ్మ (21) పుట్టుకతోనే మూగ, చెవిటి. నాగమ్మ గ్రామంలో టైలర్ పనిచేస్తుండేది. ఈనెల 19న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కూలీ పనులకు వెళ్లిన తల్లిదండ్రులు మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసే సరికి నాగమ్మ కనిపించకపోవడంతో ఆందోళన చెంది బంధువుల, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# విద్యార్థుల నమోదు పెరగాలి


అమరచింతలో వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న తహసీల్దార్, ఎంఈఓ

**అమరచింత:** బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేలా ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ రవికుమార్‌యాదవ్, ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమ వాల్‌పోస్టర్ విడుదల చేశారు.కార్యక్రమంలో ఎఎస్ఐ జమీరుద్దీన్, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణవేణి,హెచ్‌ఎంమీన,సీఆర్‌పీస్వామిపాల్గొన్నారు.

**మదనాపురం:** రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని మండల విద్యాధికారి షేక్‌ఫరూక్ హుస్సేన్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండల వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. సమావేశములో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి, జీహెచ్‌ఎం నాగరాజు, ఏపీఎం తిరుపతిరెడ్డి, సీఆర్పీలు జనార్దన్‌గౌడ్, రమేష్, ఎంఐఎస్ రాజేష్, ఆపరేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మామిడి నష్టాన్ని జిల్లా అధికారులకు నివేదిస్తాం


తెల్లరాళ్లపల్లితండాలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

**పాన్‌గల్:** మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు నష్టపోయిన మామిడి రైతుల వివరాలను జిల్లా అధికారులకు నివేదిస్తామని ఉద్యానవన అధికారి కృష్ణయ్య, ఏఓ రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండా, రాయినిపల్లి గ్రామాల్లో నేలరాలిన మామిడి కాయలను పరిశీలించి నష్టం వివరాలను సేకరించారు. మామిడి రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, గ్రామాల వారీగా వివరాలు సేకరించి జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అఖిల, రైతులు బాబునాయక్, గణేష్, ఆంజనేయులు, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం


మదనాపురంలో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**వనపర్తి విద్యావిభాగం:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సోమవారం జిల్లా కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాణిక్యం, రవిప్రకాష్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, చిట్యాల రాము, శివ, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

**వాల్‌పోస్టర్ విడుదల**

**మదనాపురం:** వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### ఉపాధి కూలీలను ఆదుకోవాలి

**ఆత్మకూర్:** ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలను ఆదుకోవాలని, పెండింగ్‌లో ఉన్న పది వారాల డబ్బులను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ కోరారు. సోమవారం మూలమళ్లలో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్ వసతి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటన్న, లక్ష్మి, సునీత, పద్మ, రేణుక, అనిత, కూలీలు ఉన్నారు.

**అమరచింత:** ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశంలో కనీస వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ అన్నారు. మండలంలోని చంద్రప్పతండాలో జరుగుతున్న ఉపాధి పనులు చేస్తున్న కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రవి నాయక్, శంకర్‌నాయక్, సీతమ్మ, విజయమ్మ, గోపాల్,రాములమ్మ, సరోజ పాల్గొన్నారు.

### ‘పెండింగ్ కూలి చెల్లించాలి’


ఎంపీఓ రాజుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**ఖిల్లాఘనపురం:** మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు కోరారు. ఖిల్లాఘనపురం, మానాజీపేట తదితర చాలా గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీల సమస్యలపై సోమవారం ఎంపీఓ రాజుకు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. మండల కేంద్రంతో పాటుగా చాలా గ్రామాల్లో కూలీలకు 12 వారాలుగా కూలి డబ్బులు రావడం లేదన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు దశరథం, గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మల్లేష్, యువమోర్చా అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్ నాయకులు బెస్త శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటిలో చేపలు


వాటర్‌ట్యాంక్ ఓవర్‌ఫ్లో ద్వారా వచ్చిన నీటిలో చేప

**అమరచింత:** పట్టణంలోని దళమికట్ట వద్ద ఉన్న ఓవర్ హెడ్‌ట్యాంక్ ద్వారా ఓవర్‌ఫ్లో అయిన మిషన్ భగీరథ నీరు కొన్ని రోజులుగా వృథాగా పారుతోంది. సోమవారం ఓవర్‌ఫ్లో అయి బయటకు వచ్చిన నీటి వెంట చేప పిల్లలు సైతం రావడంతో రాంనగర్ కాలనీ ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. రోడ్డుపై నిల్వ ఉన్న మిషన్ భగీరథ నీటిలో చేపలు కనిపించడంతో యువకులు వాటిని పట్టుకునే ప్రయత్నం చేశారు. వాటిని తినలేమని తెలిసి వదిలిపెట్టారు. కాగా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకులను నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో పురుగులతో కూడిన నీటిని తాగాల్సిన పరిస్థితి దాపరించిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పౌర సరఫరాల శాఖలో ప్రైవేట్ వ్యక్తి హవా!

- అన్నీ తానై పనులు చేస్తున్న వైనం
- అధికారిక వాట్సాప్ గ్రూపులో హల్‌చల్
- అతడికే సమాచారం ఇవ్వాలని అధికారుల సందేశాలు


జిల్లా పౌరసరఫరాల శాఖలో కంప్యూటర్‌పై పని చేస్తున్న అధికారిక ఉద్యోగి

**వనపర్తి:** జిల్లా పౌరసరఫరాల శాఖలో ఓ ప్రైవేటు వ్యక్తి అన్నీ తానై కార్యకలాపాలు చేస్తుండడం కలకలం సృష్టిస్తోంది. కార్యాలయంలో ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు, ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఉన్నా.. వారితో పని చేయించకుండా అధికారులు ప్రైవేట్ వ్యక్తిని కార్యాలయం కంప్యూటర్‌పై కూర్చోబెట్టి పనులు చేయిస్తున్నారు. అధికారిక, ధాన్యం కేటాయింపుల పత్రాలతో పాటు ఇతర పనులు చేయించడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. గోపాల్‌పేట మండలంలోని జయన్న తిరుమలాపురంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ట్యాబ్ ఎంట్రీ చేసుకునే వ్యక్తిని ఏడాది కాలంగా డీఎస్ఓ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధికారి కార్యాలయానికి పిలిపిస్తున్నారు. సదరు వ్యక్తికి ప్రతినెల వేతనంగా సొంత డబ్బు చెల్లించి పనిచేయించుకున్నట్లు తెలుస్తోంది. తమకు రాని పని చేయించుకోవడానికా.. ఏదైనా అపవాదు వస్తే ప్రైవేట్ వ్యక్తికి ఆపాదించాలని ఉద్దేశంతో జేబులో నుంచి వేతనం చెల్లిస్తూ ప్రైవేటు వ్యక్తిని ఆఫీసులో ఉద్యోగ కొనసాగిస్తున్నారా అన్న అంశం ఉన్నతాధికారుల విచారణలో తేల్చాల్సి ఉంది.


**అన్నీ తానై..**

అధికారుల అండదండలతో ఆ వ్యక్తి జిల్లా పౌరసరఫరాల శాఖలో అన్ని పనులు చక్కబెడుతూ ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు. ఎలక్ట్రానిక్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం, ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్, డీలర్ల కమీషన్, ధాన్యం కొనుగోలు విధానం, 6ఏ కేసులు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, తదితర పనులన్నీ డీఎస్ఓ కార్యాలయంలో అనధికారిక ఉద్యోగి చేతుల మీదుగా నడుస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. రూ. కోట్ల విలువచేసే ధాన్యం కేటాంపుల విషయంలో ప్రైవేటు వ్యక్తులతో ఫైల్ తయారు చేయించటం వలన ఏదైనా పొరపాట్లు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారనే విషయంపై సదరు పౌరసరఫరాల శాఖ అధికారులు ఎందుకు ఆలోచించటం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీనిపై కార్యాలయం సిబ్బంది సైతం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

**అధికారిక గ్రూపులోనూ..**

ఇటీవల ప్రారంభమైన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏదైనా సమస్య ఉన్న, టాబ్ ఎంట్రీల్లో టెక్నికల్ లోపాలున్న డీఎస్ఓ ఆఫీస్‌లో అనధికారికంగా పనిచేస్తున్న వ్యక్తిని సంప్రదించాలని పౌరసరఫరాల శాఖ అఫీషియల్ వాట్సాప్ గ్రూప్‌లో అధికారులు పోస్ట్ చేయడం శోచనీయం.

### విచారణ చేపడతాం



పౌరసరఫరాల శాఖలో ప్రైవేట్ వ్యక్తిని డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేయించుకుంటున్నారని తెలిసింది. ఏ ప్రాతిపదికన అతడిని తీసుకున్నారు.. వేతనం ఎలా ఇస్తున్నారు.. ఎందుకు ఆయన్నే తీసుకోవాల్సి వచ్చిందనే విషయంపై విచారణ చేస్తాం.

– జి. వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), వనపర్తి